చిత్రకథ



తుప్పపట్టిన స్తంభాలు తొలగించాలి

ముస్తాబాద్: స్థానిక ఐదో వార్డులో శ్రీకృష్ణ యాదవ సంఘం ఫంక్షన్ హాల్ రహదారికి ఇరువైపుల స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. పదేళ్ల కిత్రం రెండు స్తంభాల మధ్య ఉండే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కాలనీ విస్తరించడంతో తొలగించారు. స్తంభాలను అలాగే వదిలేశారు. పెద్ద వాహనాలు ఇటువైపు రావడం సమస్యగా మారిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు ద్విచక్ర వాహనదారులు పలుమార్లు స్తంభాలను ఢీకొట్టి గాయాలపాలయ్యారు. సెస్ అధికారులు ఇనుప స్తంభాలు తొలగించాలని కోరుతున్నారు.



రోడ్డు ఇలా.. వెళ్లేది ఎలా..?

తంగళ్లపల్లి: మండల కేంద్రం నుంచి లక్ష్మీపూర్ వెళ్లే తారురోడ్డు పూర్తిగా చెడిపోయింది. గుంతలమయంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పొడవున సుమారు 60 గుంతలు ఉండడంతో మట్టిరోడ్డు వేసిన బాగుండేదని తారు రోడ్డు పేరుతో నిధులను స్వాహా చేశారని విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే తారు రోడ్డును బాగుచేయాల్సి ఉంది.



నిరుపయోగంగా ఐకేపీ భవనం

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో లక్షల రుపాయాలు వెచ్చించి నిర్మించిన ఐకేపీ భవనం నిరుపయోగంగా మారింది. మహిళ సంఘాల సభ్యుల సమావేశాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు కేటాయించింది. మంజూరైన నిధులతో సిరిసిల్ల-కామారెడ్డి ప్రధాన రహదారిని ఆనుకోని భవనాన్ని నిర్మించారు. మరికొన్ని నిధులకు ప్రతిపాదనలు పంపారు. ఇదిలాఉండగా మరోచోట రూ.50 లక్షలు వెచ్చించి మరో భవనాన్ని నిర్మించి, మొదట నిర్మించిన భవనాన్ని నిరుపయోగంగా వదిలేశారు. కనీసం ఈ భవనాన్ని పూర్తిచేసి మరో ప్రభుత్వ కార్యాలయానికి కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

వంతెనలు.. ఇంతేనా?

- వచ్చారు.. చూశారు.. వెళ్లారు
- ప్రమాదకరంగా ప్రయాణం
- అసంపూర్తిగా ఎల్లారెడ్డిపేట-మల్లిమడ్ల రోడ్డు పనులు
- ఇబ్బందిపడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ఈ ఫొటో వీర్నపల్లి మండల కేంద్రంలోని పెద్దవాగుపై రూ.1.5 కోట్ల వ్యయంతో నిర్మించతలపెట్టిన బ్రిడ్జి ఇది. పనులు అసంపూర్తిగా ఉండడంతో ఇరువైపులా ఎర్రమట్టి పోశారు. వానకాలంలో ప్రయాణికులు ఇక్కడ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. బ్రిడ్జి నిర్మాణం దగ్గర ఎలాంటి ప్రమాద హెచ్చరికలు లేక ప్రయాణికులు ప్రమాదాల బారినపడుతున్నారు.



పై చిత్రంలో కనిపిస్తున్న బ్రిడ్జి మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న భూక్య తండా గ్రామపంచాయితీ పరిధిలోని దేవునాయక్ తండాకు, బావుసింగ్ నాయక్ గ్రామపంచాయతీ పరిధిలోని గోనేనాయక్ తండాల మీదుగా గుండారం, తిమ్మాపూర్ గ్రామాలకు వెళ్లే దారిలో ఉంది. ఈ బ్రిడ్జి నిర్మాణం పనులు ఆగస్టు 2021లో ప్రారంభించారు. బ్రిడ్జిని 18 నెలలో పూర్తి చేయాలని బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.157.86 లక్షలు కేటాయించారు. కాని ఇప్పటికీ బ్రిడ్జి పనులు పూర్తికాక ప్రమాదపుటంచున ప్రయాణం చేయాల్సిన పరిస్థితి దాపురించిందని తండావాసులు వాపోతున్నారు. ఈ బ్రిడ్జి నుంచి శ్మశానవాటికకు వెళ్లే దారిలో దేవునాయక్ తండాలో దాదాపు 12 కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నాయి. ఈ తండాకు రహదారి సౌకర్యం సక్రమంగా లేక వాహనాలపై రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. కనీసం 108 వాహనం రాలేని పరిస్థితి ఉంది. బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేసే వరకు ఎన్నికలను బహిష్కరిస్తామనిఅంటున్నారు.

వీర్నపల్లి: ఎల్లారెడ్డిపేట-మల్లిమడ్ల, ఎల్లారెడ్డిపేట, మల్లిమడ్ల మధ్య గల డబుల్ రోడ్డుకు మరమ్మతులు కరువయ్యాయి. రోడ్డుపై ప్రయాణించాలంటే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డుపై నిర్లక్ష్యం చూపుతున్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం నుంచి కోనరావుపేట మండలం మల్లిమడ్ల గ్రామం వరకు 24 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి ఐదేళ్ల క్రితం రూ.25 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో పనులు చేపట్టారు. నిధులు సరిపోకపోవడంతో ఇటీవల మరో రూ.25 కోట్లు మంజూరయ్యాయి. అయినా సంపూర్ణంగా డబుల్ రోడ్డు పనులు పూర్తికాక ప్రజలకు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్రిడ్జిల నిర్మాణం పూర్తిస్థాయిలో కాలేదు. బ్రిడ్జిలకు ఇరుపక్కల మట్టి పోయడంతో వర్షం కురిసిన ప్రతిసారి బ్రిడ్జిల దగ్గర బురదమయమై వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. డబుల్ రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అసంపూర్తిగా బ్రిడ్జిల నిర్మాణం

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం నుంచి మల్లిమడ్ల వరకు 7 బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, వీటిలో 6 బ్రిడ్జిలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. కోతకు గురై ప్రమాదకరంగా మారాయి. వర్షాలు కురిసిన సమయంలో అధికారులు నామమాత్రంగా మరమ్మతులు చేపడుతున్నారు. ప్రయాణికుల ప్రాణాలు పోతే తప్ప పాలకులు స్పందించేలా లేరని ప్రయాణికులు, వాహనదారులు వాపోతున్నారు.

నరకం అనుభవిస్తున్నాం



మా రోడ్డు వెంబడి ప్రయాణం చేయాలంటే నరకయాతన అనుభవిస్తున్నాం. మేము పడుతున్న బాధలు తెలవాలంటే మా తండాకు ఏ పార్టీ ప్రచార రథం ముందు వస్తదో, ఆ పార్టీ వారికే మా ఓట్లే కాకుండా, మా బంధువుల ఓట్లు, ఇతరుల ఓట్లు కూడా పడేవిధంగా చేస్తాం. ఎన్నిసార్లు అధికారులకు ప్రజాప్రతినిధుల చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి మా రోడ్డును బాగు చేయండి.

– భూక్య కమల, దేవునాయక్ తండా వాసి

కిలోమీటర్ దూరం నరకం



మండల కేంద్రంలో సుమారు కిలోమీటరు దూరం ప్రయాణానికి నరకయాతన పడుతున్నం. గుంతల దారిలో వాహనం వెళ్లాలంటే చుక్కలు కనిపిస్తున్నాయి. గర్భిణులు, బాలింతలు అవస్థలు పడుతున్నరు. దుమ్ముతో దారి వెంబడి ఇళ్లలోని వారు రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని రహదారి పనులు ప్రారంభించాలి.

– గంగాధరి సంజీవ్ వీర్నపల్లి

క్లుప్తంగా

మూడు గ్రామాల్లో పోలీస్ కవాతు



రామన్నపేటలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

చందుర్తి: మండలంలోని రామన్నపేట, తిమ్మాపూర్, ఆశిరెడ్డిపల్లె గ్రామాల్లో పోలీసు కవాతును బుధవారం నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా సాయుధ బలగాలతో గ్రామంలోని ప్రతి వీధిలో పోలీసుల కవాతు నిర్వహించారు. నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. అనంతరం గ్రామ చావడి వద్ద చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ మాట్లాడారు. గ్రామాల్లో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోరారు. గ్రామాల్లో ఎలాంటి సంఘటన చోటు చేసుకున్న కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే గ్రామాల్లో వివాదస్పదులను గుర్తించి పోలీసు రికార్డులో పేర్లు నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సిరిసిల్ల ఆశోక్, పోలీసు బలగాలు పాల్గొన్నాయి.

మద్యం పట్టివేత



సీజ్ చేసిన మద్యం

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ శివారు డాబాలో అక్రమంగా అమ్ముతున్న మద్యం సీసాలను బుధవారం పోలీసులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఇల్లంతకుంట ఎస్సై దాస సుధాకర్ మాట్లాడుతూ అనుమతి లేకుండా ఎవరైనా మద్యం విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మద్యం విక్రయిస్తున్న షేరు ఎల్లంను బైండోవర్ చేసి అతని వద్ద నుండి 24 బీర్ సీసాలు, నాలుగు లీటర్ల లిక్కర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని పట్టుకున్న కానిస్టేబుళ్లు అనిల్, మధును ఎస్సై అభినందించారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ప్రారంభిస్తున్న కొనుగోలు కేంద్రం

కోనరావుపేట: మండలం నిమ్మపల్లి, మరిమడ్లలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేపీ సీసీ బాలరాజు బుధవారం ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో మాట్లాడుతూ రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చి మద్దతు ధర పొందాలన్నారు. రైతుల కోసం ఏర్పాటు చేసిన కేంద్రాలను సద్వినియోగపర్చుకోవాలని కోరారు. మహిళా సంఘం అధ్యక్షురాళ్లు, రైతులు, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమానికి విద్యార్థుల విరాళం

సిరిసిల్లటౌన్: అనాథ ఆశ్రమానికి తమ వంతు ఆర్థికసాయం అందించిన చిన్నారి విద్యార్థులు ఔదార్యం ప్రదర్శించారు. సిరిసిల్ల పట్టణం అశోక్‌నగర్‌లోని వివేకానంద విద్యానికేతన్ విద్యార్థులు 'ఎండిహెచ్‌డబ్ల్యూష్' అనాథ ఆశ్రమం పిల్లల కోసం రూ.16,251 సేకరించగా పాఠశాల ప్రిన్సిపాల్ బుచ్చయ్య నిర్వాహకులను అందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

వేములవాడఅర్బన్: వేములవాడ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ బూర వజ్రమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడినట్లు ఎంపీడీవో శ్రీధర్ తెలిపారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య



బాధితులను పరామర్శిస్తున్న ఆగయ్య

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో వివిధ కారణాలతో మరణించిన బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. గ్రామానికి చెందిన బెస్త ఎల్లం, తుపాకుల ఎల్లవ్వ, గ్రామ పంచాయతీ కార్మికురాలు జంగం లక్ష్మినర్సవ్వ అనారోగ్యంతో మృతి చెందగా, ఈ మూడు బాధిత కుటుంబాల సభ్యులను బుధవారం వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. మంత్రి కేటీఆర్,ప్రభుత్వ సహకారంతో నిరుపేద బాధిత కుటుంబాలను పూర్తి స్థాయిలో ఆదుకుంటామన్నారు. ఆయన వెంట నాయకులున్నారు.

ప్రభుత్వ పాఠశాలకు సామగ్రి



బ్యాగులు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

గంభీరావుపేట: మండలంలోని దమ్మన్నపేట జెడ్పీహెచ్‌ఎస్‌కు యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ కరీంనగర్ వారు సామగ్రి వితరణ చేశారు. విద్యార్థులకు రూ.10 వేల విలువైన పఠన, లేఖన సామాగ్రిని బుధవారం అందించారు. స్టడీ మెటీరియల్, స్కూల్ బ్యాగులు, కంపాస్ బాక్స్‌లు, ఇంగ్లిష్ డిక్షనరీలు, రాత పుస్తకాలు, పెన్నులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్‌రావు, సర్పంచ్ సిరిగిరి లక్ష్మీ, విద్యాకమిటీ చైర్మన్ చంద్రమౌళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత పరీక్షలు

ముస్తాబాద్: మండలంలోని కోండాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు దంత వైద్య పరీక్షలను నిర్వహించారు. డాక్టర్ శ్యాంసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు డెంటల్ పరీక్షలను నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. దంత సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. దంతాలను శుభ్ర పరుచుకోవడం, చిగుళ్ల ఆరోగ్యంగా ఉంచుకునేలా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు, లయన్స్ క్లబ్ సెక్రటరీ నాయినీ భాస్కర్, కోశాధికారి రావుల మల్లారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రోడ్డు పక్కన వృథాగా ట్రీగార్డ్స్

బోయినపల్లి: బోయినపల్లి నుంచి వేములవాడ వెళ్లే దారిలో మార్కెట్ యార్డు, కేజీబీవీ పరిసరాల్లో రోడ్డు పక్కకు మొక్కల రక్షణకు పెట్టాల్సిన ట్రీ గార్డులు ఇలా అస్తవ్యస్తంగా పడి ఉన్నాయి. మొక్కల రక్షణకు వినియోగించాల్సి ట్రీ గార్డులు ఇలా వ్యర్థంగా పడిపోయి ఉన్నాయంటే, మొక్కల రక్షణ విషయంలో అధికారులు ఎంత శ్రద్ధ తీసుకుంటున్నారో అర్థం చేసుకోవాలని ప్రజలు అనుకుంటున్నారు.



ఆంక్షల్లో చిక్కుకున్న 108

వేములవాడ: ఎన్నికల ఆంక్షల కారణంగా వేములవాడ మండల పరిషత్ ముందున్న రోడ్డును అధికారులు ఉదయం 10 గంటల నుంచి 3 గంటల వరకు మూసివేసి ఉంచుతున్నారు. దీంతో బుధవారం అంబులెన్స్ ఆంక్షల్లో చిక్కుకుని ట్రాఫిక్‌లో నిలిచిపోయింది.

పోలీసుల అదుపులో దొంగ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో రామ దామోదర్ ఇంట్లో వరుస దొంగతనాలకు పాల్పడ్డ వ్యక్తిని బుధవారం గ్రామస్తులు పట్టుకొని పోలీసులు అప్పజెప్పారు. బాధితుడు రామ దామోదర్ తెలిపిన వివరాలు. వరుసగా తన ఇంట్లో నుంచి నగదు, బంగారు నగలు మాయమవుతుండడంపై అనుమానంతో నిఘా పెట్టారు. ఇటీవల దామోదర్ తల్లి మృతిచెందగా అందరూ ఇంట్లోనే ఉండడంతో ఎలాంటి దొంగతనం జరుగలేదు. బుధవారం ఇంట్లోకి వచ్చి డబ్బులు దొంగిలిస్తుండగా గమనించి దామోదర్ భార్య అరవడంతో స్థానికులు దొంగను పట్టుకుని పోలీసులకు అప్పజెప్పారు. గత నెలలో వరుసగా మూడుసార్లు రూ.15వేలు, రూ.14వేలు, రూ.12వేలు, రెండు తులాల బంగారు నగలు మాయమయ్యాయని దామోదర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన ఇంట్లో కోరుట్లపేటకు చెందిన సూర శ్రీనివాస్ దొంగతనానికి పాల్పడ్డట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎల్లో డే వేడుకలు



ఎల్లారెడ్డిపేట: మండలం రాచర్ల బొప్పాపూర్‌లో జ్ఞానదీప్ హైస్కూల్లో బుధవారం ఎల్లో డే వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పసుపురంగు దుస్తులతో పాఠశాలకు హాజరయ్యారు. స్కూల్ కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ రిన్సీ జార్జ్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి



మహ్మద్ రఫీక్ (ఫైల్)

వేములవాడరూరల్: మండలంలోని నమిలిగుండుపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మహ్మద్ రఫీక్ (53) గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. 2013 నుంచి 2018 వరకు గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా, మండల కోఆప్షన్ సభ్యుడుగా కొనసాగారు. బీఆర్‌ఎస్ పార్టీలో సీనియర్ నాయకుడుగా పేరున్న ఆయన బుధవారం ఉదయం ఇంటి వద్దనే గుండెనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు వేములవాడ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య షమీల, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

దీపావళి టపాసులకు దూరంగా జరుపుకుందాం

సిరిసిల్లకల్చరల్: దీపావళి పండుగను దీపాలతో స్వాగతిద్దామని ధరణి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు కట్ట వింధ్యారాణి పిలుపునిచ్చారు. పట్టణంలోని తుక్కారావుపల్లె, గణేశ్‌నగర్ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు దీపావళి విశిష్టతను వివరించడంతో పాటు టపాసుల కారణంగా కలిగే కాలుష్యాన్ని గురించి వివరించారు. ఈసారి దీపావళి పండుగను దీపాలతో స్వాగతించాలని పిల్లలకు సూచించారు.